ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేన నాయకులు గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఉండవని మాటిచ్చారు. కానీ మా గ్రామంలో ఏడాదికి రూ.7 లక్షలకు వేలం పాట పెట్టారు. నేరుగా ఓ లైసెన్స్ దుకాణం ప్రతినిధులే వచ్చి ఈ పాటకు సహకరించారు. ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇస్తే వచ్చి పాటకు అడ్డుకట్ట వేశారు. లైసెన్స్‌డ్ దుకాణదారులే బెల్ట్ షాపులకు సహకరిస్తే ఎలా?

\- పెందుర్తి మండలం జుత్తాడ గ్రామస్తుల ఆవేదన



ఇటీవల బెల్ట్ దుకాణంలో పట్టుబడిన మద్యం

సార్ మా ఊళ్లో రాత్రి 1 గంట వరకు బెల్ట్ దుకాణంలో పార్టీలు చేసుకుంటున్నారు. ఇళ్ల మధ్యలో ఉన్న ఈ దుకాణంలో మందుబాబులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ఖాళీ సీసాలు మా ఇళ్లపైకి విసురుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇక్కడే తాగి తందనా లాడుతున్నారు. పూటుగా తాగి గొడవలకు దిగుతున్నారు. ఎలాగైనా ఆ దుకాణాన్ని మూయించండి సార్.

\- సబ్బవరం మండలం గ్రామీణ ప్రాంత మహిళల గోడు

బార్లా.. బెల్ట్ దుకాణాలు

- ఎన్నికల్లో బెల్ట్ దుకాణాలు నిషేధిస్తామన్న కూటమి
- గ్రామాల్లో ఇష్టానుసారంగా వెలుస్తున్న బెల్ట్ దుకాణాలు
- కూటమి నాయకుల కనుసన్నల్లో సాగుతున్న వ్యాపారం
- గ్రామాల్లో వేలం పాటలు.. లైసెన్స్ షాపుల నుంచే మద్యం సరఫరా!



పెందుర్తి: ఎన్నికల సమయంలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి నేతలు మద్యం బెల్ట్ దుకాణాలను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి రానే వచ్చారు. వచ్చాక పాత మద్యం పాలసీ(ప్రభుత్వ దుకాణాల)ని రద్దు చేసి ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు కట్టబెట్టారు. దీంతో నియోజకవర్గంలో మద్యం బెల్ట్ దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రోజురోజుకూ పెరుగుతున్నాయి. స్వయంగా కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఆయా దుకాణాలు వెలుస్తున్నాయి. ఫలితంగా జనవాసాల్లో బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం ఏరులై పారుతోంది.

ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి

నియోజకవర్గ కేంద్రం పెందుర్తి, గ్రామీణ ప్రాంతం సబ్బవరం, పారిశ్రామిక ప్రాంతం పరవాడలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. దాదాపు ప్రతి గ్రామంలో రెండు మూడు బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. నేరుగా దుకాణదారులే రంగంలోకి దిగి గ్రామాల్లో వేలం పాటల ద్వారా బెల్ట్ దుకాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతంలో తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే క్రమంలో ప్రధాన దుకాణదారులే బెల్ట్ దుకాణాలకు స్వయంగా మద్యాన్ని సరఫరా చేస్తుండటం గమనార్హం. నియోజకవర్గంలో ఈ తరహా బెల్ట్ వ్యాపారం సిండికేట్ ప్రధాన దుకాణాలకు సమాంతరంగా నిర్వహిస్తుండటం విశేషం.

సిండికేట్ ఇష్టారాజ్యం

వాస్తవానికి మద్యం దుకాణాల నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాక బెల్ట్ దుకాణాలకు మార్గం సుగమం అయింది. లైసెన్స్ దుకాణాలు దాదాపు 90 శాతం కూటమి నాయకుల చేతిలోనే ఉండడంతో బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరాలో ఇబ్బంది లేకుండా పోయింది. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి యథేచ్ఛగా బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. లైసెన్స్‌డ్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు పెరగాలంటే బెల్ట్ దుకాణాల ద్వారా ప్రజలకు అందుబాటులో సరకు ఉంచాలన్నదే వీరి వ్యాపార సూత్రం.

గత ప్రభుత్వంలోనే కట్టడి

2014-2019 వరకు టీడీపీ హయాంలో ప్రైవేట్ మద్యం పాలసీతో ఆ పార్టీ నేతలే మద్యం సిండికేట్‌గా ఏర్పడి మద్యం వినియోగదారులను దోచుకునేవారు. గ్రామాల్లో నిరంతరం మద్యం అందుబాటులో ఉండేలా చూసుకునేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేట్ మద్యం పాలసీని పూర్తిగా రద్దు చేసి, బెల్ట్ దుకాణాలను నియంత్రించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రాకతో మద్యం వ్యాపారం సిండికేట్ల చేతుల్లోకి వెళ్లింది. ఫలితంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది.

మండలాల వారీగా బెల్ట్ దుకాణాలు (అనధికారిక సమాచారం)

ప్రాంతం	పంచాయతీలు	గ్రామాలు	బెల్ట్ దుకాణాలు (దాదాపు)
పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో..	15	33	50
పట్టణ ప్రాంతంలో..			200
సబ్బవరంలో..	24	60	130
పరవాడలో..	14	35	70

‘బెల్ట్’తీస్తాం!



లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల్లో మాత్రమే నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలి. బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు చేస్తే ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్ట్ దుకాణాలపై దాడులు విస్తృతంగా చేస్తున్నాం. రెండు మూడు గ్రామాల్లో బెల్ట్ దుకాణాల ఏర్పాటుకు వేలం పాట విషయం మా దృష్టికి వస్తే వెంటనే ఆ ప్రక్రియను నిలుపుదల చేశాం. బెల్ట్ దుకాణాలపై ప్రజలు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

\- **కె.వి.సతీష్‌కుమార్**, సీఐ, లా అండ్ ఆర్డర్, పెందుర్తి

ఎంతటివారైనా చర్యలు తప్పవు



బెల్ట్ దుకాణాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. సబ్బవరం మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాల ఏర్పాటుకు వేలం జరుగుతుందన్న ముందస్తు సమాచారంపై స్పందించి, వేలం జరగకుండా నిరోధించగలిగాం. ఎక్కడైనా అనధికారికంగా మద్యం విక్రయించడం చట్టరీత్యా నేరం. కాబట్టి ఎక్కడ బెల్ట్ దుకాణం నిర్వహించినా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. నిర్వాహకులను అరెస్ట్ చేస్తాం. ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవు.

\- **డి.అనిల్‌కుమార్**, సీఐ, సెబ్(ఎక్సైజ్), సబ్బవరం

క్లుప్తంగా

వేంకటాద్రి హుండీ లెక్కింపు

- 110 రోజులకు రూ.9,64,030 ఆదాయం



హుండీ లెక్కిస్తున్న అధికారులు, వేంకటాద్రి సేవకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి క్షేత్రంలో వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 110 రోజులకు గాను రూ.9 లక్షల 64 వేల 30 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి పీఎల్‌ఎన్ రాజు తెలిపారు. ముందుగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. లెక్కింపులో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, వేంకటాద్రి సేవకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



మాంగళ్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎన్‌జీజీవోస్ కాలనీ దరి శాంతిపురానికి చెందిన కలిదిండి హేమసాయి రమణ లక్ష్మి అనే దాత రూ.లక్ష 1,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ దాతకు బాండ్ ఇచ్చారు. అనంతరం స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కమిటీ సూచనలు



ఆస్పత్రిని పరిశీలిస్తున్న అభివృద్ధి కమిటీ చైర్మన్ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ బోకం సూర్యకుమారి అధ్యక్షతన మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరతపై చర్చించి, సిబ్బందిని పెంచేలా తీర్మానం చేసి డీఎం అండ్ హెచ్‌వోకు పంపించాలని చైర్మన్ సూచించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల వ్యయంపై చర్చించి పలు సూచనలిచ్చారు. సమావేశంలో పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఎస్ఎస్ఎస్ చక్రవర్తి, అభివృద్ధి కమిటీ సభ్యులు సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, బోకం రామునాయుడు, కొటాన రాము, ఎంపీడీవో పద్మజ, సబ్బవరపు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సబ్బవరం: మల్లునాయుడుపాలెం నేవల్ డాక్‌యార్డ్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘం కార్యాలయంలో గౌరవ అధ్యక్షుడు రొంగలి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎం.దాసుబాబు, ఉపాధ్యక్షుడిగా జి.అచ్యుతరావు, కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.రవి, సహాయ కార్యదర్శి ఆర్‌వీ రమణ, కోశాధికారి జి.దేముడు, సహాయ కోశాధికారి ఎస్.హరీష్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఎర్రన్నాయుడు, పి.ఈశ్వరరావు, అచ్చెంనాయుడు, జి.చిన్నారావు ఎన్నికయ్యారు.

ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా రీ సర్వే

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న



గుల్లేపల్లిలో రీ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకన్న

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండవ విడత రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలంలోని గుల్లేపల్లిలో చేపట్టిన రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా రైతుల సమక్షంలో రీ సర్వేను నిర్వహించాలని సూచించారు. కమతాల హద్దుల నిర్ధారణ సమయంలో నాలుగు పక్కల ఉన్న రైతుల సమక్షంలో జరగాలని, విస్తీర్ణాలలో వ్యత్యాసం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మ్యాప్‌లను పరిశీలించారు. సర్వే అధికారులకు సహకరించేలా రైతులు విధిగా తమ భూ హక్కు పత్రాలను అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, సర్పంచ్ బండారు మంగ, మాజీ ఎంపీపీ గండి దేముడు, బండారు శ్రీను, బోను గంగునాయుడు, వీఆర్వో అప్పలరాజు, విలేజ్ సర్వేయర్లు మౌనిష, బి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ధర్మశ్రీకి ఆత్మీయ సత్కారం



ధర్మశ్రీని అభినందిస్తున్న అదీప్‌రాజ్, నియోజకవర్గ పార్టీ నాయకులు

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభినందించారు. నగరంలోని ధర్మశ్రీ నివాసంలో మంగళవారం ఆయనకు పూలమాల వేసి అభినందనలు తెలిపారు. సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, పెదగొల్లలపాలెం సర్పంచ్ మోపాడ అప్పారావు, పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేముడు, అనకాపల్లి జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, పరవాడ, పెందుర్తి పార్టీ మండలాధ్యక్షులు కోన రామారావు, గొరపల్లి శ్రీను, వార్డు అధ్యక్షులు మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, రాపర్తి మాధవరావు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు మనాలత జోబ్‌దాస్(చిన్ని), సుందరపు అప్పారావు, పైడిరెడ్డి, మద్ది శ్రీను, వేపాడ శ్రీను, రఘు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో చక్కటి దిగుబడి



సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కలిగిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెందుర్తి: పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం వలన అధిక దిగుబడి రావడంతో పాటు రైతులకు సాగు వ్యయం కూడా తగ్గుతుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త(మృత్తికశాస్త్రం) డాక్టర్ టి.శ్రీలత అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జెర్రిపోతులపాలెం, నరవ, పినగాడి ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ జీవ ఎరువుల వాడకం వలన పంట బలంగా పెరిగి, నాణ్యత ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుంటే ఇటు పంటకు.. అటు రైతుకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పలు అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు. కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సరిత, సేద్యశాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.గౌరీ బృందం రైతులకు మేలైన సేద్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, ఏఈవో రమణ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన తుప్పలు.. తప్పని తిప్పలు



డీఆర్డీవో రహదారిలో ఏపుగా పెరిగిన తుప్పలు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం-ఎస్సీ కాలనీ రోడ్డులో దట్టంగా పెరిగిన తుప్పలు డొంకలు వలన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రహదారిలో డీఆర్డీవోలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులతో పాటు బీచ్‌కు వెళ్లే పర్యాటకులు, ఎస్సీ కాలనీ ప్రజలు, తిక్కవానిపాలెం మత్స్యకార్మికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలతో విష జీవులు రోడ్డు పైకి వచ్చి భయబ్రాంతులకు గురిచేస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పల తొలగింపునకు వీలైనంత వేగంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు పదే పదే విన్నవించినా ఫలితం కనిపించలేదని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు



పెదముషిడివాడ- అసకపల్లి మధ్య గోతులతో నిండిన రహదారి



రెండు నెలలు తిరక్క ముందే పెచ్చులుగా ఊడిపోతున్న వాడచీపురుపల్లి రోడ్డు



ఫార్మాసిటీ రోడ్డులో ఎగసిపడుతున్న దుమ్ము

పరవాడ: మండలంలో అధ్వాన రోడ్లతో గ్రామీణ ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్లకు మహర్దశ పట్టిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడమే తప్ప, కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో నరకం అనుభవిస్తున్నామని పెదముషిడివాడ పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పెదముషిడివాడ-అసకపల్లి గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులపై అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

భారీ వాహనాలతో మరింత ఛిద్రం

ఈ రెండు గ్రామాల మధ్య పూర్తిగా ఛిద్రమైన రహదారిని బీటీ రోడ్డుగా తీర్చిదిద్దుతామని, అందుకు రూ.65 లక్షలు మంజూరైనట్లు పెదముషిడివాడలో జరిగిన సమావేశంలో వెల్లడించారు. నెలలు గడుస్తున్నా ఈ పనుల అతీగతీ లేదు. బూడిద, బొగ్గు లారీలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించడం వల్లే చాలా వరకు రోడ్డు ధ్వంసమైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని వాపోతున్నారు. నిత్యం రహదారిలో వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలలు తిరక్కముందే గోతులు

రెండు నెలల కిందట మరమ్మతులు చేపట్టిన వాడచీపురుపల్లి-ఎన్టీపీసీ రహదారి నెలలు తిరక్కముందే పెచ్చులుగా ఊడిపోయి గోతులు ఏర్పడ్డాయని ప్రయాణికులు ఆక్షేపిస్తున్నారు. ఇక్కడి ప్రజయ్ లేఅవుట్ వద్ద రోడ్డు పెచ్చులుగా ఊడిపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాటు ఊటదెడ్డ కూడలికి సమీపంలో మరమ్మతులు చేసిన రోడ్డు నెలలు తిరక్క ముందే పగుళ్లు వేసి పెచ్చులుగా ఊడిపోతోంది. పరవాడ-ఫార్మాసిటీ రోడ్డులో పలు చోట్ల రోడ్డు ధ్వంసం కావడంతో రహదారిలో ఏ చిన్న వాహనం వెళ్లినా దుమ్ము, ధూళి కమ్ముకుంటోంది. రహదారిలో ప్రయాణాలు సాగించడానికి పడరాని పాట్లు పడుతున్నామని, దుమ్ము ధూళితో అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకొచ్చి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పరవాడ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ స్వర్ణలత తదితరులు

సబ్బవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు డాక్టర్ ఎస్.స్వర్ణలత తెలిపారు. మండలంలోని పైడివాడలో మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ వడ్డాది అప్పలరాజు ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 16 పాడి పశువులకు వైద్య పరీక్షలు జరిపారు. 22 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సను అందించారు. 10 చూడి ఆవులకు తనిఖీలు చేశారు. 28 లేగ దూడలకు, గ్రామంలోని గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ, డాక్టర్ జి.అరుణ, కె.రమణ, పశు సంవర్ధక శాఖ సహాయకులు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, అరుణ, గోపాలమిత్ర భాస్కరరావు పాల్గొన్నారు.

పరస వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో సోమవారం రాత్రి పరసలో జరిగిన గొడవలో పెందుర్తి పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరసలోకి వెళుతుంటే దొడ్డి లక్ష్మి, దొడ్డి కిరణ్, సూరిశెట్టి గౌతమి, సూరిశెట్టి గణేష్‌బాబు, బొడ్డేటి సాయి అనే వ్యక్తులు తమను అడ్డగించి, తమ కుటుంబంపై దాడి చేసినట్లు కొత్తపాలెం ప్రాంతానికి చెందిన ఎం.ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన మెడలో ఉన్న 10 తులాల బంగారు హారాన్ని దొడ్డి లక్ష్మి, సూరిశెట్టి గౌతమి తెంచేసి అక్కడి నుంచి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ధనలక్ష్మి కుటుంబం అకారణంగా దాడి చేసి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని దొడ్డి లక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్‌కుమార్ వెల్లడించారు.

రాజకీయ కక్షతోనే: దొడ్డి కిరణ్

అధికార టీడీపీ సానుభూతిపరులైన ధనలక్ష్మి కుటుంబం తమపై కక్ష పూరితంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కిరణ్ ఆరోపించారు. కొందరు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతోనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. నిజానికి కోటనరవలో పరస జరుగుతున్న సమయంలో తాను అక్కడ లేనని కిరణ్ స్పష్టం చేశారు. దీనిపై పోలీసులు పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు.